# చల్లని వెన్నెల

శైలకుమార్



"ఎంత సేపయిందిరా వచ్చి?" ప్రశ్నించాడు చంద్ర—రూంలో తాపీగా కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్న రమణను చూసి.

"ఇప్పుడే. ఏమైంది ఇంటర్వ్యూ?" రమణ.

"బ్రహ్మాండం! సెలెక్టు అయిపోయినట్లే అనుకో. ఇక డ్యూటీలో జాయిన్ కావటమే. మరి నీ దేముంది?"

"నాదీ అంతే" అన్నాడు రమణ నవ్వుతూ.

"రేయ్! నాకీ రోజు ఎంత ఆనందంగా ఉందో తెలుసా? జీవితంలో మొదటి సారిగా ఇంత ఆనందం పొందుతున్నా. చదువు పూర్తయిన వెంటనే ఇంత మంచి ఉద్యోగం దొరకటం...నా వల్ల కావటం లేదురా. నీ ఒక్కడితోనే ఈ ఆనందం పంచుకోలేక పోతున్నాను. ఇంకా ఎవరికో చెప్పాలి. భయం నా తల తిను రుతూ 'నాకు తెలుసు—నువ్వు సాధిస్తావు చంద్రా,' అంటూ ఆనందంతో పొంగిపోతూ రమణను వాటేసుకున్నాడు చంద్ర.

ఆ విషయం తెలిసిన రమణ నవ్వుతూ—"అలాగే లేరా—నాకు మాత్రం ఆనందంగా లేదనా! ముందు స్నానం చెయ్యి," బాత్‌రూంలోకి తరిమాడు చంద్రని.

రమణ, చంద్ర ఇంటర్మీడియట్ నుంచి స్నేహితులు. స్నేహం దినం దినం పెరిగి విడిపోలేనంత ఆత్మీయులు అయ్యారు ఇద్దరూ. ఎం. కాం. పాసై బాంక్ ఆఫీసరు పోస్టులకు ఇంటర్వ్యూకని మద్రాసు వచ్చారు. హోటల్‌లో మకాం.

స్నానం చేసి తుడుచుకుంటూ వచ్చాడు చంద్ర.

"ఉద్యోగం వచ్చింది—ఇక పెళ్ళి చేసుకుంటా వన్నమాట" అన్నాడు రమణ.

"అవున్రా, ఇక మాధవికి దూరంగా ఉండలేను. సాధ్యమైనంత త్వరలో విజయవాడ వెళ్ళి తనని తీసుకు రావాలి" అన్నాడు.

"అదృష్టవంతుడివి" అంటూ లేచి బట్టలు వేసుకోసాగాడు రమణ.

"ఎక్కడికిరా బయలు దేరావు?" చంద్ర.

"ట్రిప్లికేన్‌లో నా చిన్నప్పటి మాస్టారొకరున్నారు చూసి వస్తాను. నువ్వు హాయిగా వూరు తిరిగిరా." చెప్పి వెళ్ళి పోయాడు రమణ.

చంద్రకూడా తయారై బీచికి వెళ్ళాడు. అప్పుడే పాల వెన్నెల లాంటి తెల్లని కాంతి కురిపించే మెర్క్యూరీ దీపాలు వెలుగుతున్నాయి. అలంకరించుకున్న అందమయిన ఆడపిల్లలా ఉంది నగరం. ఆమె నుదుట ఎర్రని బొట్టులా వెలుగుకురిపిస్తున్న లైట్‌హౌస్ నడుం ఒంపులా కొద్దిగా మెలిక తిరిగిన తారురోడ్డు. ఒక దాని వెనక పోటీ పడి పరుగెత్తుతున్న కార్లు బస్సులు వాటి హారన్లు. ఒక్క క్షణం ఆలస్యమయిందంటే ఎక్కడ ఏం జరుగుతుందో అన్నట్లు వేగంగా నడుస్తున్న మనుష్యులు. అర్థంకాని అరవభాష ఘోష. శబ్ద సముద్రంలా, చైతన్య పర్వతంలా ఉంది మద్రాసు నగరం.

ఇవేవీ తనకు పట్టని ఋషిలా సిగరెట్ కాలుస్తూ తాపీగా నడుస్తున్నాడు చంద్ర.

"ఏమ్మ సార్, కొంచెం నెరుప్పు ఇస్తారా?"

అడిగిన వ్యక్తిని తేరిపార చూశాడు చంద్ర. గళ్ళ లుంగీ, మాసిన చొక్కా, నోటిలో బీడీ, మొరటుగా ఉన్న మొహం. అగ్గిపెట్టె తీసి ఇచ్చాడు. వెలిగించుకుని ఇచ్చేశాడు అతను.

"తెలుంగు వారుదానా, సార్!"

"ఊ" అన్నట్లు తల వూపాడు చంద్ర, వాడి వచ్చీ రాని తెలుగుకు నవ్వుకుంటూ.

"నల్ల తెలుంగు అమ్మాయిదా ఉంది—వస్తారా" చెవిదగ్గర మొహం పెట్టి రహస్యం చెబుతున్నట్లు అడిగాడు.

అంతవరకు వీస్తున్న గాలి మరింత చల్లగా అనిపించింది చంద్రకు. నరాల దారుల గుండా తీయని విద్యుత్తు ప్రాకి కోరికల కాంతి నింపుతుంది శరీరం. వెళ్ళాలా, వద్దా! సందేహంలో చంద్ర. వూహల్లో తప్ప ఎన్నడూ లభ్యం కాని స్త్రీ స్పర్శ ఎలా ఉంటుందో, ఆ అనుభవానందం లోని పారవశ్యం తెలుసుకుంటే...ఆలోచనలో పడ్డ చంద్ర వీపుపై చళ్ళున కొరడాతో కొట్టినట్లు మనసులో మాధవి మెదిలింది. ఆమె చిరునవ్వు అతన్ని బంధించేస్తోంది. రెండు సంవత్సరాల క్రితం వెళ్ళలేక వెళుతూ అతని పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకున్న మాధవి పెదవుల స్పర్శ అతనిలో జీవం పోసుకుంది.

"వాంగో, సార్" అన్నాడు వాడు చంద్ర భుజం పట్టి కుదుపుతూ.

వెళ్ళాలా, వద్దా అన్న వూగిసలాట. అయినా ఒక్క

పారి కేసువుతుంది?

"రండి, సార్, పోదాము." మంత్రముగ్ధుడిలా అనుసరించాడు చంద్ర. ఇద్దరూ ఒక ఇంటి లోకి ప్రవేశించారు.

ఒకనాడు ఈ దేశంలో త్రిమూర్తుల్ని పాపలుగా చేసి ఆడుకున్న స్త్రీలకు, పాతివ్రత్యంతో సూర్య గమనాన్ని ఆపగలిగిన స్త్రీలకు వారసులం అన్నట్టు వరసగా నిలుచున్నారు. అమ్ముకోవడానికి అంతకంటే మరేమీ లేదన్నట్లు, కసాయి ఆర్థిక వ్యవస్థ క్రాసుపై శిలువ వెయ్యబడిన పసి పాపలట్లు అమ్మాయిలు.

సిగ్గుతో కాస్త తల వంచుకుని ఓరగా వారిని గమనిస్తున్న చంద్ర ఆఖరి అమ్మాయిని చూసి ఉలిక్కి పడ్డాడు. చంద్రను చూసి గబగబా లోనికి వెళ్ళి పోయిం దామె.

"ఆ...ఆ.... అమ్మాయి..."తడబడ్డాడు చంద్ర.

ఆ అమ్మాయిని చంద్ర కోరుకున్నాడని భావించి, అతన్ని గదిలోకి పంపి, బలికి లాక్కు వస్తున్న మేకలా లాక్కు వచ్చి ఆ గదిలోకి తోశారు ఆమెను.

కలో, నిజమో అర్థం కాని ఆశ్చర్యంలో ఇద్దరూ. గుండెలో అగ్ని పర్వతాలు బద్దలై, ఆ వేడి లావాలో జీవం కొట్టుకు పోతున్నంత బాధ ఇద్దరిలో.

"మాధవీ...నువ్వు...ఇక్కడ...నిజంగా నువ్వేనా?" లోయలోంచి మాట్లాడుతున్నట్లు అన్నాడు చంద్ర.

"బాగున్నావా, చంద్రా" అంది కన్నీళ్ళతో అతని దగ్గరగా వచ్చి.

"అయితే విజయవాడలో ఉంటున్నానని చెప్పటం, ఉత్తరాలు రాయటం అంతా అబద్ధమే నన్న మాట. ఎందుకిలా మోసం చేశావు?" కటినంగా అన్నాడు చంద్ర.

"మోసం చెయ్యాలని కాదు, చంద్రా!" అతనికి దగ్గరగా వచ్చింది మాధవి.

"ఛీ! ఇన్నాళ్ళు నాకు పంపింది ఇలా సంపాదించిన డబ్బన్న మాట." దూరం జరిగాడు చంద్ర.

అక్కున చేర్చుకుని ఆదరించి ఆప్యాయత కురిపించ వలసిన చంద్ర అలా చెయ్యటంతో దెబ్బ తింది మాధవి.

"అవును" అంది స్థిరంగా.

"ఇలా చెప్పటానికి, చెయ్యటానికి నీకు సిగ్గుగా లేదూ?" అసహ్యంగా చూశాడు ఆమె వైపు.

"సిగ్గు పడవలసింది నేను కాదు, చంద్రా! ఇంత కష్టపడి నువ్వు చదువుకోవాలని నేను డబ్బు పంపుతూ ఉంటే, ఆ డబ్బుతో ఆడదాన్ని కొనుక్కోవటానికి వచ్చిన నువ్వు సిగ్గు పడాలి!" రోషంగా అంది మాధవి.

"మాధవీ" అన్నాడు చంద్ర. ఇద్దరి మనసులూ రెండు సంవత్సరాలు వెనక్కి పరుగెత్తాయి.

* * * *

"కంగ్రాచ్యులేషన్స్. నిన్న పోటీలో మీరు చాలా బాగా మాట్లాడారు" అంది మాధవి, కాలేజీ ఆవరణలోకి ప్రవేశిస్తున్న చంద్ర నుద్దేశించి.

తలెత్తి మాధవిని చూసి "థాంక్స్ అండీ" అన్నాడు బిడియంగా అంతకంటే ఏం మాట్లాడాలో తెలీక. మొదటిసారిగా ఒక అమ్మాయి వచ్చి అతన్ని చనువుగా అభినందిస్తున్నందుకు ఒక వైపు ఆనందంగాను, ఒక వైపు బిడియంగాను ఉంది చంద్రకు.

"మొత్తానికి అటు చదువులోను, ఇటు ఆటల లోను మీరే ఫస్టు వస్తున్నారు" అంది అతనితో పాటు నడుస్తూ.

ఏం చెప్పాలో తెలియక నవ్వాడు చంద్ర.

"ఇదేమిటి, ఈ రోజు మీ రొక్కరే వస్తున్నారు? రమణ ఏమయ్యాడు?" చొరవగా అడిగింది మాధవి.

"వాడికీ రోజు కాస్త జ్వరంగా ఉందండీ" అన్నాడు. సాధారణంగా ఇద్దరూ కలిసే ఉంటారు.

క్లాసు రూమ్స్ దగ్గరికి రావటంతో చంద్ర, మాధవి విడిపోయారు. క్లాసులో కూర్చున్నాడే కాని చంద్ర ఆలోచనలంతా మాధవి ఆక్రమించుకుంది. సాయంత్రం వెళ్ళి పోయే ముందు చంద్ర దగ్గిరికి వచ్చింది మాధవి.

"రేపు సాయంత్రం మీరు మా ఇంటికి టీకి రావాలి. మా నాన్నగారిని పరిచయం చేస్తాను" అంది మాధవి.

"ఎందుకండీ అనవసరంగా శ్రమ!" ఎప్పుడూ ఎవరి ఆహ్వానాన్నీ అందుకోని చంద్ర వారించాడు.

"మీరు అలా అంటే లాభం లేదు. తప్పకుండా రావాలి." మరీ బలవంతం చేసింది మాధవి. ఒప్పుకోక తప్పలేదు చంద్రకు.

రూమ్‌కు వెళుతూనే జరిగినదంతా రమణకు చెప్పాడు చంద్ర. "రేయ్! నీ పరిమితుల్లో నువ్వుండు. అన్నిటికీ కాలమే సమాధానం చెబుతుంది" అన్నాడు యోగిలా రమణ.

"ఇంతకూ మాధవిపై నీ అభిప్రాయం ఏమిటి?"

"సంస్కారం, వ్యక్తిత్వం, తెలివి ఉన్న ఒకమంచి అమ్మాయి. చాలా ఇంకేం అడక్కు" అన్నాడు రమణ.

మాధవి ఇంటిలో ముందు కాస్త బిడియ పడినా, వారి కలుపుగోలు తనంతో కలిసిపోయాడు చంద్ర. బలవంతంగా భోజనానికి ఉంచారు అతన్ని. వారి ఆదరణకు పొంగిపోయాడు చంద్ర.

రోజు రోజూ మాధవి, చంద్రల పరిచయం పెరుగుతూనే వచ్చింది. మాధవి ఇస్తున్న ప్రోత్సాహానికి కాలేజీలోని ప్రతి పోటీలో మొదటి వాడుగా వస్తున్నాడు చంద్ర. మాధవి అతనిపై చూపిస్తున్న అనురాగానికి పొంగి పోతున్నాడు. వాళ్ళ గురించి అన్ని విషయాలు తెలుసుకుంటూ నిశ్శబ్ద ప్రేక్షకుడిలా మిగిలిపోతున్నాడు రమణ.

పరుగెత్తుతున్న కాలంలో ఫైనల్ ఇయర్ వచ్చింది. పరీక్ష ఫీజు కట్టడానికి ఆ రోజే ఆఖరు తేదీ. ఉన్న రెండు ట్యూషన్లు పోవటంతో ఏం చెయ్యాలో తోచలేదు చంద్రకు. ఆ రోజు కూడా రమణ ఎం. ఒ. రాలేదు. ఏదో చేద్దాంలే అనే ధైర్యం చెబుతూనే ఉన్నాడు రమణ. పరీక్షలు రాయలేనేమో అన్న దిగులుతో మధ్యాహ్నం క్లాసులు ఎగ్గొట్టి బాధగా కాలేజీ గార్డెన్‌లో కూర్చున్నాడు చంద్ర.

"ఏమిటి, చంద్రా, అంత మౌనంగా కూర్చు న్నావు" అంటూ అతని దగ్గరకు వచ్చింది మాధవి.

"ఏం లేదు, మాధవీ!" అన్నాడు గంభీరంగానే. వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి అతని కళ్ళు.

"ఏమీ లేకపోతే అలా ఎందుకు ఉంటావు? ఏమిటో చెప్పు" అంటూ ఎదురుగా కూర్చుంది మాధవి.

"పరీక్షలు రాయటం లేదు...అందుకు" అన్నాడు తలవంచుకుని.

"ఫీజు కట్టడానికి లాస్ట్ డేట్ అనేగా, ఏమను కోకు, చంద్రా! నీ ఫీజు నే కట్టేశాను" అని రసీదు అతని చేతికి ఇచ్చింది.

"మాధవీ!" అంటూ తల ఎత్తాడు. అతని కళ్ళు నీళ్ళు రాలుస్తున్నాయి.

"ఛ ఏమిటిది చిన్న పిల్లాడిలా?"

"ఎందుకు మాధవీ ఇంత అభిమానం నేనంటే?"

"నువ్వు పరీక్షలు రాయకపోతే నష్టపోయేది నేనేగా!" అంది కొంటెగా చూసి.

"నువ్వు నష్టపోవటం ఏమిటి?" అన్నాడు అర్థంకాక.

"జీవితాంతం నీతో ఉండాల్సిన దాన్ని...నీ నష్టం నాది కాదూ!" అంది.

ఆమె ఏమన్నదో మొదట అర్థం కాలేదు చంద్రకు. కొన్ని క్షణాలకు అర్థమై ఉలిక్కి పడ్డాడు.

"ఏమిటి, మాధవీ, నువ్వంటున్నది?"

"నా మనసులో ఉన్నది" అంది కాస్త సిగ్గుగా.

"జరిగే పనేనా ఇది?"

"ఎందుకు కాదు."

"మాధవీ! ఒక పూట ఉంటే మరో పూట వెతుక్కోవలసిన పరిస్థితి నాది. చిన్నప్పటి నుండి ట్యూషన్లు చెబుతూ, స్కాలర్‌షిప్పుల మీద చదువు సాగించాను. నా అంటూ ఎవ్వరూ లేనివాడిని" బాధగా అంటూ తన పరిస్థితి వివరించాడు చంద్ర.

"అందుకే అన్నీ నేనై వస్తానంటున్నాను, చంద్రా!" అని చెప్పి, మెల్లిగా లేచి వెళ్ళింది మాధవి.

ఎవరు. ఎవర్ని ఎందుకు ప్రేమిస్తారో ఎవ్వరూ చెప్పలేరు. తీయని మత్తులాగా, విద్యుత్తులాగా,

## ఏది సమంజసం?

**ముల్లా** నసిరుద్దీన్ ఒక సారి భార్యతో "కాస్త జున్ను తెచ్చిపెట్టు" మన్నాడు. జున్ను జఠరాగ్నిని వృద్ధి చేస్తుందనీ, జీర్ణశక్తిని పెంచుతుందనీ జున్ను విశేషణాల్ని ఏకరువు పెట్టాడు.


"ఇంట్లో జున్ను లేదే" అన్నది భార్య మెల్లగా.

"ఫరవాలేదులే. లేకపోవడం మంచిదే. ఆలోచించగా జున్నుకు కడుపులో వాయువును ప్రకోపింప చేసే గుణం, చిగుళ్ళను బలహీనపరిచే లక్షణం ఉన్నట్లు గుర్తుకొచ్చినై" అన్నాడు నసిరుద్దీన్.

"ఇందాక అట్లా అంటిరి. ఇప్పుడిట్లా అంటు న్నారు. జున్నును గురించి మీరు వెలిబుచ్చిన ఈ రెండు అభిప్రాయాల్లో ఏది నిజమండీ?" అని ఆశ్చర్యంతో అడిగింది భార్యామణి.

"ఇంట్లో గనుక జున్ను ఉండి ఉంటే మొదటి అభిప్రాయం సమంజసం. లేకపోయినట్లయితే రెండవసారి చెప్పినదే నిజం" అని తేల్చేశాడు నసిరుద్దీన్.

-ప్రసీల్




పెను తుఫానులాగా మనిషిని వూపేస్తుంది ప్రేమ. అది ఎన్ని త్యాగాలు చేయిస్తుందో, ఎంత ఉన్నతికి తీసుకుపోతుందో, ఎవర్ని ఎందుకు పతనం చేస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. ఎందుకు, ఏముందని ప్రేమించావ్ అని ప్రేమికుల్ని అడిగితే—సరైన సమాధానం చెప్పలేరేమో! ఆలా ప్రేమించుకున్నారు చంద్ర మాధవి.

పరీక్షలు అయిపోయిన రోజు ఇద్దరూ కలుసుకున్నారు యూనివర్శిటీ పార్కులో.

"ఏం చేద్దామనుకుంటున్నావు, చంద్రా." అడిగింది మాధవి.

"ఏముంది, మధూ! ఏదో ఒక ఉద్యోగం వెతుక్కుంటాను."

"వద్దు, చంద్రా! నువ్వింకా చదవాలి. ఎంతో గొప్పవాడివి కావాలి. ఎన్నో సాధించాలి" అంది కాస్త ఉద్రేకంగా మాధవి.

"నాకూ చదవాలనే ఉంది, మధూ! కాని పరిస్థితులు తెలుసుగా నీకు." బాధగా అన్నాడు.

"డబ్బు గురించేగా నువ్వనేది, చంద్రా నీకెందుకు నేను పంపుతాను." నిశ్చయంగా అంది.

"నువ్వా...ఎలా పంపుతావు, మధూ" అన్నాడు అనుమానంగా.

"ఎలా ఏమిటి? ఉద్యోగం చేస్తాను. నీ కన్నా నాకు త్వరగా ఉద్యోగం వస్తుంది. తెలుసా" అంది మాధవి.

"నిజమే, మధూ! కాని నిన్ను కష్టపెడుతూ, నీ డబ్బుతో నన్ను చదువుకోమంటావా?" అన్నాడు బాధగా.

"ఇందులో బాధ పడాల్సింది ఏముంది, చంద్రా! నువ్వు చదివిస్తే నేను చదువుకోనూ! నువ్వు సంపాదిస్తే నేను తీసుకోనూ! అయినా నీ డబ్బు, నా డబ్బు అని ఎందుకు ఆలోచిస్తావు. నా సర్వస్వమూ నీది కాదు. నువ్వు గొప్పవాడివి అయితే, ఆ గొప్ప నాక్కాదూ! ప్లీజ్ ఒప్పుకో" అంది దీనంగా.

"ఎందుకో బాధగా ఉంది, మధూ!"

"అలా ఫీల్ కావద్దు, చంద్రా, కొంత కాలమే ఇలా. ఆ తరవాత జీవితాంతం నువ్వు సంపాదించింది తీసుకుంటూ, నీ గొప్పదనంలో భాగం పంచుకుంటూ ఉంటా...సరేనా" అంది అతన్ని అనునయిస్తూ ఒప్పుకునేట్లు చేస్తూ.

"అంతవరకు ఆగ గలవా, మధూ!"

"బతికుంటే నీ తోనే ఉంటాను. నీకు అన్నీ నేనే ఇస్తాను" అంది కన్నీళ్ళు నింపుకుని. అతని కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

"పిచ్చి" అంటూ దగ్గరగా తీసుకుని పెదవులపై గాఢంగా ముద్దు పెట్టుకుంది మాధవి, అది పార్కు అన్న విషయంకూడా మరిచి.

ఆ తరవాత పై చదువుల కెళ్ళాడు చంద్ర.

తను విజయవాడలో ఉద్యోగం చేస్తున్నట్లు, బంధువుల ఇంట్లో ఉన్నది కాబట్టి కలుసుకోవడానికి ప్రయత్నం చెయ్యవద్దని ఉత్తరాలు రాసేది మాధవి. ప్రతి నెల డబ్బు అందులోంది చంద్రకు.

• • •

"మాధవీ! ఎందుకిలా చేశావు? ఎందు కింతగా పతనమయ్యావు. ఇంతకన్నా మంచి ఉద్యోగం దొరకలేదా నీకు?" ప్రేమ, అసహ్యం కలిసిన స్వరంతో అడిగాడు చంద్ర.

"కన్నవాళ్ళని కాదని వచ్చేసిన ఆడది ఇంతకన్నా ఏం చెయ్యగలదు! అనుక్షణం ఆడదాని అందాన్ని కాటు వెయ్యాలని చూస్తున్న ఈ మగ లోకంలో ఇంతకంటే మంచి ఉద్యోగం ఎలా దొరుకుతుంది? ఒక స్త్రీ ఇంతకన్నా తేలిగ్గా ఎలా సంపాదించ గలుగుతుంది?" అంది ఆవేశంగా మాధవి. కన్నీళ్ళు ఆగిపోయాయి.

"అందరూ ఇలాగే చేస్తున్నా రంటావా?"

"అందరికీ ఇదే పరిస్థితి ఉందంటావా!"

"ఉద్యోగం దొరక్కపోతే వెంటనే నాకా విషయం తెలియ చెయ్యవచ్చుగా?" రోషంగాఅన్నాడు చంద్ర.

"తెలిపితే ఏం చేసే వాడివి. నిజంగానే విజయవాడలో రెండు మూడు ఉద్యోగాలు చేశాను. అప్పుడే నా పతనం ప్రారంభమయింది. చివరికి ఇక్కడికి చేరాను."

ఇద్దరి మధ్యా కాసేపు మౌనం రాజ్యం చేసింది.

"అయితే ఇప్పుడేం చెయ్యాలనుకుంటున్నావు?" కాస్త వ్యంగ్యంగా అడిగాడు.

"అది నిర్ణయించుకోవలసింది నువ్వు!" వ్యంగ్యం భరించలేక అంది. కాసేపు ఆలోచించాడు చంద్ర. "నువ్వు నా కిచ్చిన డబ్బు నీకు త్వరలోనే పంపుతాను" అన్నాడు గోడను చూస్తూ.

"డబ్బుమాత్రమేపంపగలవు" అంది బరువుగా—అతని మాటలకు ఆశ్చర్యపోయి ఇంత దిగజారాడా నేను ప్రేమించిన చంద్ర అని మనసులో అనుకుంటూ.

"అంటే ఇంకేం చెయ్యాలంటావు!" హేళనగా అడిగాడు.

"అంతకంటే ఇంకేం చెయ్యలేవు నువ్వు. అయినా ఇవ్వాల్సిన అవసరం లేదులే. తిరిగి ఇస్తావని నేన్నీకు ఇవ్వలేదు. కావాలనుకుంటే ఆ మొత్తం పది రోజుల్లో సంపాదించగలను." కటినంగా అంది మాధవి.

"పెళ్ళి చేసుకోమంటావా అయితే" వ్యంగ్యంగా అన్నాడు చంద్ర.

"నువ్వు చేసుకుంటా నన్నా నేనే కాదంటాను, చంద్రా! ఏ రోజు పతనమయ్యానో ఆ నాడే నిర్ణయించుకున్నాను—నీ జీవితం లోకి రాకూడదని" స్థిరంగా అంది మాధవి.

"మాటలు నేర్చావు."

"జీవితం నేర్పింది!"

"వెళుతున్నా" అంటూ వెళ్ళడానికి లేచాడు చంద్ర. తను ఎవరి కోసం ఇలా అయిందో తెలిసీ కనీసం సానుభూతి అయినా చూపని చంద్రను చూసి మాధవి మనసు నిండా అసహ్యం ప్రవేశించింది.

"అదేం...డబ్బిచ్చి వచ్చిన పని కాకుండానే వెళుతున్నావు" అంది మాటలే ఈటెలుగా అతనికి గుచ్చుకునేలా.

"ఛీ ఐ హేట్ యూ!" అసహ్యంగా ఆమె వైపు చూసి వెళ్ళి పోయాడు చంద్ర.

నిద్ర నుంచి లేచి తలుపు తీసి అర్ధరాత్రికి పైగా అయిందని గ్రహించి "ఇంతవరకూ ఎక్కడి కెళ్ళావురా—ఏమయ్యావో అని గాభరా పడుతున్నా" అడిగాడు రమణ.

సమాధానం చెప్పకుండా మంచంపై వాలి పోయాడు చంద్ర. నిద్రమత్తులో అదేదీ గమనించకుండా తిరిగి నిద్రలోకి జారుకున్నాడు రమణ.

రమణ నిద్ర లేచేసరికి కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు చంద్ర.

"ఏమిట్రా...అలా ఉన్నావు? అసలు అర్ధరాత్రి దాకా ఎక్కడి కెళ్ళావు?"

రమణ మాటలకు సమధానం చెప్పలేదు చంద్ర.

"ఏమిట్రా ఏమయింది నీకు?" దగ్గిరికి వచ్చి కుదుపుతూ అడిగాడు రమణ. రమణ ఒడిలో వాలి చిన్న పిల్లవాడిలా వెక్కి వెక్కి ఏడుస్తూ, జరిగింది చెప్పాడు చంద్ర.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. తుఫాను తరవాత వెలసిన ప్రశాంతత.

"మరేం చెయ్యదలచుకున్నావు?" ముందుగా రమణే అడిగాడు.

"తను నాకై ఇచ్చిన డబ్బంతా తిరిగి ఇచ్చేయాలనుకుంటున్నా."

ఆ మాటలు అంటున్న చంద్రను చూసి అసహ్యం వేసింది రమణకు.

"ఎలా అనగలిగావురా ఆ మాట. సంపాదించ



ఫోటో – కె. శి. వశిష్ఠ (మదురై)

గలిగావు కాబట్టి ఆమె డబ్బు తిరిగి ఇవ్వగలవు. కాని ఆమె నీ కోసం, నీ భవిష్యత్తు కోసం పోగొట్టుకున్న వన్నీ తిరిగి ఇవ్వగలవా?'' చిత్రవధ చేస్తున్నట్టు అన్నాడు రమణ.

"అయితే ఏం చెయ్యమంటావు?'' అడిగాడు చంద్ర.

"పెళ్ళి చేసుకుని హాయిగా కాపరం చెయ్యి'' అన్నాడు ఆదేశిస్తున్నట్లు.

"అంత పతనమై వేశ్యగా మారిన ఆమెను పెళ్ళి చేసుకొమ్మంటావా?''

చేసుకోను అన్న నిశ్చయం వినిపిస్తోంది చంద్ర మాటల్లో.

"పతనం అన్నది శరీరానికి కాదురా—మనస్సుకు సంబంధించినది. నీ కోసం, నీకు మంచి భవిష్యత్తు ఇవ్వటంకోసం నీకు సుఖమైన జీవితం ప్రసాదించటం కోసం ఎంతో విలువైన శీలాన్ని పణంగా పెట్టిన మాధవిని మలినమైంది అనటానికి నీకు నోరెట్లా వచ్చింది? దిగజారింది ఆమె కాదురా...ఆమె రక్త మాంసాలు పిండుకుని, ఆమె శరీరం అమ్మి పంపిన డబ్బుతో చదువుకుని ఈ రోజు ఆమెనే కాదంటున్న నువ్వు నిజంగా పతన మయ్యావు, దిగజారావు.'' ఆవేశంగా అన్నాడు రమణ.

"అలా సంపాదించి పంపమని నే నడగలేదే!''

అగ్నిగోళాలయ్యాయి కోపంతో రమణకళ్ళు. "చిన్న పిల్లవాడిలా మాట్లాడకు...తంతాను. ఆమె ఇదంతా చేసింది నీ కోసం కాదూ? నిన్ను కాదనుకొని పెద్దల మాటలు విని పెళ్ళి చేసుకుని ఉంటే సుఖపడేది కాదూ తను. అప్పుడు మోసంచేసింది అంటూ నువ్వే ఏడ్చేవాడివి.''

రమణ కోపం చూసి ఏమీ మాట్లాడలేదు చంద్ర.

"చూడు, చంద్రా! ఈ లోకంలో నిజమైన ప్రేమ అన్నది లభ్యం కావటం చాలా దుర్లభం. దొరికినా, గుర్తించలేని అజ్ఞాను లుంటారు కొందరు. నటించటం తప్ప ప్రేమించటం తెలీదురా చాలా మందికి. ఎంతో అన్యోన్యంగా కనుపించే వాళ్ళమధ్య కూడ ఎక్కువగా ప్రేమకన్నా నటనే ఉంటుంది. ఈ వ్యవస్థలో డబ్బును తప్ప దేన్నీ ప్రేమించటంలేదు మనిషి. దాన్నే కాదని ప్రేమించగలిగారా అంటే ఎంతో గొప్ప సంస్కారం, హృదయ వైశాల్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. అంత నిజమైన ప్రేమను పొందిన నువ్వు దాన్ని పోగొట్టుకో వద్దంటున్నాను. ఆలోచించు—ఎంత ప్రేమ లేనిదే ఆమె నీకోసం అంత త్యాగం చేస్తుంది!'' బుజ్జగిస్తున్నట్లు సౌమ్యంగా చెప్పాడు రమణ.

"నో...నో, రమణా! నా వల్ల కాదు, నేను చేసుకోలేను'' అన్నాడు నిశ్చయంగా చంద్ర.

ఇక లాభం లేదనుకొని కాసేపు మౌనంగా ఆలోచించి—"ఆమె ఇప్పుడు ఎక్కడ ఉంది'' అడిగాడు రమణ.

రాత్రి అతడు వెళ్ళిన దారి, ఇంటి గుర్తులు చెప్పాడు చంద్ర. "నువ్వు తిరుపతి వెళ్ళు—నేను తర వాత వస్తా'' నని చంద్రను పంపించేశాడు రమణ.

"బావున్నావా, మాధవీ!'' పలకరించాడు రమణ.

"నా మాటకేం... నువ్వెలా ఉన్నావు?''

విషాదంగా నవ్వాడు రమణ.

"నీకూ నా మీద కోరికగా ఉందా?'' అక్కడికి వచ్చినందుకు తప్పుగా అర్థం చేసుకుంది రమణను మాధవి.

"మాధవీ! అందుక్కాదు నేను వచ్చింది.''

"మరి?'' కుతూహలంగా అడిగింది.

"నిన్నిక్కడ నుంచి తీసుకువెళ్ళాలని వచ్చాను.'' సూటిగా ఆమెనే చూస్తూ అన్నాడు.

"ఎక్కడికి తీసుకు వెళ్ళాలని? ఎవరు తీసుకు రమ్మన్నారు?'' ఆశగా అడిగింది.

"నాతోపాటు, నా జీవితంలోకి తీసుకువెళ్ళటానికి, మాధవీ!''

"అంటే?'' అనుమానంగా అంది.

"నిన్ను పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాను.''

గట్టిగా నవ్వింది మాధవి. "నే నింతకాలం ఎలా జీవించానో, ఎంతగా పతన మయ్యానో తెలిసే అంటున్నావా, రమణా!'' అంది.

"తెలుసు, మాధవీ! నా దృష్టిలో పతనమయింది నువ్వు కాదు. నిన్ను ఉపయోగించుకుని జీవితంలో ఎదిగిపోయి, చివరికి నిన్ను కాదన్న చంద్రం నిజంగా పతనమయ్యాడు. నాకు నువ్వు హిమాలయమంత ఎత్తుగా కనిపిస్తున్నావు.''

"వద్దు, రమణా! నాలాంటి దాన్ని కోరుకోవద్దు. నీకున్న ఆ సానుభూతి చాలు'' అంది ఏడుస్తూ.

"దయచేసి కాదనకు, మాధవీ! ఇంతకాలం ఒకరి కోసం త్యాగంచేస్తూ పతనం కాలేదు నువ్వు. ఈ నాటి నుంచీ నీ కోసం నువ్వు శరీరం అమ్ముకుంటూ మాత్రం పతనం కావద్దు.'' బాధగా అన్నాడు రమణ.

"అయినా, నన్నే ఎందుకు కోరుకుంటున్నావు, రమణా?''

"స్వార్థంతో, మాధవీ! ప్రేమించిన వ్యక్తికోసం ఎంత గొప్ప త్యాగమైనా చెయ్యగల నీ హృదయం కోసం! ఎంత గాఢంగా నువ్వు ప్రేమించగలవో తెలుసు గాబట్టి ఆ ప్రేమలో నేనూ భాగంపొందటం కోసం'' అన్నాడు ఆమెకు దగ్గరగా వచ్చి.

"కాని, రమణా! నా హృదయంలో ఇంకా ...''

ఆమె మాట పూర్తికాకముందే—"నాకు తెలుసు, మాధవీ, ఇంకా నీ హృదయంలో చంద్ర జ్ఞాపకాలు ఉన్నాయని అవి ఇంత త్వరగా మాసిపోవని నాకు తెలుసు. కాని, కాల గమనంలో మార్పు వచ్చి నన్నూ ప్రేమించ గలవనే నమ్ముతున్నాను కాదనకు'' అన్నాడు కన్నీళ్ళతో.

"మళ్ళీ, ముందు బాధపడతావేమో!''

"లేదు, మాధవీ! ఆ అవకాశం రాదు.'' చేయి చాచాడు.

కాసేపు ఆలోచించి కన్నీళ్ళతో అతని చేతిలో చెయ్యి కలిపింది మాధవి. వెయ్యి మంగళవాద్యాలు ఒక్కసారి మ్రోగినట్లు ఆకాశం నుండి పూల అక్షతలు తలపై పడినట్లు, తీయని స్వప్నంలోకి, మధురమైన మైకంలోకి వూహించుకున్న లోకంలోకి అడుగు పెడుతున్నట్లు అనుభూతించింది ఆ క్షణం ఆమె.

*